కథ

# మంచిరోజు

గన్నవరపు నరసింహామూర్తి

"ఏమండోయ్! ఈరోజు సాయంత్రం త్వరగా రండి. పాసింజర్‌లో మావాళ్లింటికి వెళ్లాలన్న విషయం మరచిపోవద్దు" దివాకరం డ్యూటీకి వెళ్తుంటే జానకి మరోసారి గుర్తుచేసింది. ఆరోజు ఉదయంనుంచి యిప్పటికి పదిసార్లైనా ఆ విషయాన్ని చెప్పి వుంటుందామె. అప్పుడే టిఫిన్ ముగించి బూట్లు వేసుకుంటున్న దివాకరానికి ఆమె మాటలు విసుగుపుట్టించాయ్!

"తెలుసులేవోయ్! రేపు ఎంత మన పెళ్లిరోజైనా, మనం వెళ్తున్నది ఎంత మీ పుట్టింటికైనా మరీ యింత ఆత్రం పనికిరాదు. ఏం పెళ్లిరోజంటే నీకే గాని నాకు లేదా సరదా? నాకూ రైల్వే పట్టాలపై రోజూ చేస్తున్న పనులతో విసుగుపుడుతోంది. నాకూ కొన్నాళ్లపాటు ఎట్లైనా వెళ్లాలని వుంది. అందుకే మధ్యాహ్నం త్వరగా వస్తాలే. నువ్వు అన్నీ సర్ది రెడీగా వుండు" అంటూ తన బ్రీఫ్‌కేసును ట్రాలీమేన్‌కిస్తూ చెప్పాడు.

"అన్నీ ఎప్పుడో సర్దేసాను మహానుభావా! యిప్పుడిలాగే అంటారు. తీరా ట్రాలీ ఎక్కితే చాలు మేమెవ్వరం గుర్తుకురాము. ఇంట్లో పెళ్లాం అన్నది ఎదురుచూస్తుంటుందన్న ధ్యాసే మీకుండదు. అందుకే యిన్నిసార్లు చెప్పడం" కేరియర్‌తో ఉన్న బ్యాగును ట్రాలీవాడికిస్తూ వ్యంగ్యంగా చెప్పింది జానకి.

ఆమె మాటలు వింటూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ బయలుదేరాడు దివాకరం. దివాకరం ఆ స్టేషనులో జూనియర్ యింజనీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ ట్రాలీ మీద రైల్వేట్రాక్ పై వెళ్తూ వాటికి మరమ్మతులు నిర్వహించే పని అతనిది. ముఖ్యంగా అతను పనిచేస్తున్న టైడా రైల్వే స్టేషన్ ఘాట్ సెక్షన్‌లో ఉండటం వల్లనూ, అదీగాక ఆ సెక్షన్‌లో పదిహేను టన్నెల్స్ ఉండటం వల్లనూ ఆ రైల్వే లైనుని వర్షాకాలంలో నిర్వహించడం చాలా ఇష్టంతో కూడిన పని. ఎప్పుడు ఏ కొండల మీదనుంచి బండరాళ్లు జారిపడతాయో, ఏ కటింగ్‌లో మట్టికూలిపోతుందో, ఏ టన్నెల్ ఎప్పుడు మూసుకుపోతుందో చెప్పడం కష్టం. అందుకే అనునిత్యం జూనియర్ యింజనీరూ అతని గ్యాంగు స్టాఫ్ అప్రమత్తంగా ఉంటూ ఆ రైల్వే లైన్లను కాపలా కాయాలి. లేకపోతే రైళ్లు ప్రమాదాలకు గురికావడం తథ్యం. అయితే పని విషయంలో దివాకరం చాలా నిక్కచ్చిగా వుండటంవల్ల ఆ సెక్షన్‌లో ఎప్పుడూ ఎటువంటి ప్రమాదాలు జరగలేదు.

దివాకరం, జానకిలకు పెళ్లై ఆ మర్నాటికి సంవత్సరం అవుతుంది. రైల్వేలో యింజనీర్‌గా పనిచేస్తున్న దివాకరంతో వివాహం అనేసరికి జానకి చాలా సంతోషపడింది. ఎందుకంటే చిన్నప్పట్నుంచీ రైళ్లన్నా వాటిలో ప్రయాణాలన్నా ఆమెకెంతో యిష్టం. అదీగాక ఒంటరిగా విసిరేసినట్లుండే రైల్వే కోలనీలంటే ఆమెకు మరింత యిష్టం.



చిన్నప్పుడు రైల్వేలో పనిచేసే ఆమె మామయ్య యింటికి వెళ్లినప్పుడు ఆ యిష్టం ఏర్పడింది. ఇప్పుడు దివాకరంతో పెళ్లైతే తను శాశ్వతంగా ఆ రైల్వే కోలనీల్లోనే ఉండొచ్చున్న ఆలోచనే ఆమెకు ఎంతో ఆనందాన్నిచ్చింది. అదీగాక జూనియర్ యింజనీర్ అంటే అతని క్రింద చాలామంది గేంగువాళ్లు పనిచేస్తుంటారు. తను ఏ పనీ చెయ్యక్కర్లేదు. అన్నీ వాళ్లే చూసుకుంటారు. పైగా దొరమ్మన్న హోదా కూడా! యివన్నీ ఆలోచించి దివాకరాన్ని ఎంతో యిష్టపడి పెళ్లి చేసుకుంది గ్రాడ్యుయేటైన జానకి.

జానకి తండ్రి విశ్వనాథం విజయనగరం దగ్గర ఒక పల్లెలో టీచర్‌గా పనిచేస్తూ అక్కడే యిల్లు కట్టుకున్నాడు. జానకి ఒక్కర్తే

కూతురు కావడంతో ప్రతి నెలా ఆమె తల్లిదండ్రులు ఆమెను చూడటానికి వస్తుంటారు.

పెళ్లైన వెంటనే దివాకరం, జానకి వేరు కాపురం పెట్టారు. టైడా స్టేషన్ ఎత్తైన కొండల మధ్య లోయలో వుంటుంది. కొండమీద స్టేషన్ భవనం ఉంటే, క్రిందన ఉద్యోగుల క్వార్టర్స్ వుంటాయి. దివాకరం జూనియర్ యింజనీర్ కావడంతో అతనికి విశాలమైన టైప్ త్రీ క్వార్టర్ కేటాయించారు. చుట్టూ కాంపౌండ్‌వాల్‌తో పాటు మధ్యన పెద్ద పూలతోట. దాని మధ్య ఊయల. ఇంటికెదురుగా ఆకాశాన్ని తాకుతూ పెద్ద పెద్ద కొండలు. వర్షాకాలంలో ఆ కొండలన్నీ పచ్చని వలిసె పూల చీరకట్టినట్లుంటాయ్.

మొదట్లో ఆ చిన్న స్టేషన్‌లో ఆ రైల్వే జీవితం జానకికి బాగా నచ్చింది. ముఖ్యంగా ఆమెకి నచ్చింది అక్కడ ప్రశాంతత! అక్కడి గ్యాంగువాళ్ల అమాయకత్వం, నిష్కల్మత! ఉదయాన్నే దివాకరం ఎనిమిది గంటలకు డ్యూటీకి బయలుదేరుతాడు. వెళ్తూ కేరేజీలో భోజనం పట్టుకెళ్తాడు. మళ్లీ వచ్చేది రాత్రి ఎనిమిది తరువాతే! ఇక వర్షాకాలంలో అయితే అతను ఎప్పుడొచ్చేదీ ఎవ్వరూ చెప్పలేరు. అన్నీ సక్రమంగా ఉంటే సరి; లేకపోతే రెండు రోజులదాకా రాడు. ఒక్కోసారి ట్రాక్‌ని రాత్రిపూట పెట్రోలింగ్ చెయ్యవలసి వుంటుంది. దివాకరం డ్యూటీకి వెళ్లిన తరువాత జానక్కి సమయం గడవడం కష్టంగా వుంటుంది. చాలాసేపు పుస్తకాలతో కుస్తీపడుతుంది. కాసేపు పడక. ఇంక సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురుచూపు. ఇలా సంవత్సరం గడిచిపోయింది.

జానకి తల్లిదండ్రులు మొదటి పెళ్లిరోజుని తమింట్లో జరుపుకోవాలనీ కోరుతూ అల్లుడికి ఉత్తరం రాశారు. ఆ ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచి జానకి ఆనందానికి హద్దులు లేవు. ఎంత త్వరగా ఆరోజు వస్తుందా అని వేయి కళ్లతో ఎదురుచూడసాగింది. ఎలాగైతేనేం వాళ్లు ఆమె పుట్టింటికి వెళ్లే రోజు రానే వచ్చింది. ఆ రోజు సాయంత్రమే వాళ్ల ప్రయాణం.

దివాకరానికి చెవిలో యిల్లు కట్టుకొని పోరు పెడితే గానీ బయలుదేరడని జానకి ప్రగాఢ నమ్మకం. ఎందుకంటే సంవత్సరం నుంచీ అతని దినచర్యని నిశితంగా గమనించడంవల్ల దివాకరం పరిస్థితిని ఆమె అంచనా వేయగలదు.

ఆరోజు సాయంత్రం పాసింజర్లోనే వాళ్ల ప్రయాణం కావడంతో మూడు గంటలకే ఆమె తయ్యారై దివాకరం గురించీ ఎదురుచూడసాగింది. మాటిమాటికీ గేటు దగ్గరకొచ్చీ స్టేషన్ వైపుచూడటం, అతను రాకపోవడంతో నిరాశపడటం జరుగుతోంది. క్షణ క్షణానికి ఆమెలో ఆతృత పెరగసాగింది. తనతో పనిచేసే గేంగుమాన్ రామయ్యని స్టేషన్‌కి పంపి దివాకరం ఎక్కడున్నాడన్న విషయాన్ని ఆరా తీసింది.



అతను రెండు గంటలకే చిమిడిపల్లి స్టేషన్ నుంచి బయలుదేరాడని సమాచారం వచ్చింది. అదే నిజమైతే ఈపాటికి అతను యింటికి వచ్చేయాలి.

ఇంతలో ఈదురుగాలులతో సహా భారీ వర్షం మొదలైంది. ఒక్కసారిగా ఆ లోయలో చీకటి ఆవరించింది. ధారపాతంగా కురుస్తున్న వర్షాన్ని చూస్తుంటే ఆమెకెందుకో భయం వేయసాగింది. ఇలాంటి వర్షం వస్తే దివాకరం రావడం కష్టం అవుతుంది. జరగరానిదేదైనా జరిగితే యింక తమ ప్రయాణం రద్దవడం ఖాయం. అందుకే వర్షం త్వరగా తగ్గిపోవాలనీ ఆమె లోపల లోపల దేవుణ్ణి ప్రార్థించసాగింది. యింతలో పాసింజర్ వచ్చే వేళయింది. కానీ వర్షం తగ్గలేదు సరికదా మరింత పెద్దదైంది. వర్షం కుండపోతగా కురుస్తోంది.

ఉండుండి పిడుగుల శబ్దంతో ఆ లోయ ప్రతిధ్వనించసాగింది. ఆమె మనసెందుకో కీడుని శంకిస్తోంది. మొదటి పెళ్లి రోజుకి ఎలాగైనా తనూ, భర్త కలిసి పుట్టింటికెళ్లాలనీ నెలరోజుల నుంచీ ఎన్నో కలలు కంది. చాలారోజుల తరువాత భర్తతో ఒంటరిగా ట్రైన్‌లో ప్రయాణం, స్టేషన్‌కి తమ కోసం తండ్రి రావడం, ఆ తరువాత జట్కాలో యింటిదాకా పొలాల మధ్య ప్రయాణం, యింట్లో తల్లి చేసే సందడి...యివన్నీ తలుచుకుంటూ ఈ నెల్లాళ్లూ గడిపేసింది. కానీ ఇప్పుడిలా అవాంతరం రావడం ఆమెకి బాధగా వుంది. దుఃఖంతో ఆమెకంట్లో నీరు పెల్లుబుకసాగింది.

ఈ సమయంలో ఒక గేంగ్‌మేన్ పరిగెత్తుకుంటూ వచ్చి "అమ్మగారూ! ఏభై ఆరో కిలోమీటర్లో పదిహేనో టన్నెల్ దగ్గర బండరాళ్లు లైనుపై పడ్డాయట. ఈరోజు దొరగారు సమయానికి అక్కడే ఉండడం వల్ల పాసింజరు బండిని ప్రమాదం జరగకుండా ఆపేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందటమ్మా! స్టేషనులో అందరూ చాలా అదృష్టమైన రోజంటూ చెప్పుకుంటున్నారమ్మా. అందుకనీ దొరగారు రెండురోజుల దాకా రావడం కుదరదటమ్మా" అంటూ పిడుగులాంటి వార్త చెప్పాడు. ఆ వార్తన విన్న జానకి మస్తిష్కం మొద్దుబారిపోయింది. నిస్త్రాణగా అక్కడే ఉన్న కుర్చీలో కూలబడిపోయింది. ఆమె ఆలోచిస్తోంది. తను అనుకున్నంత పనీ అయ్యింది. మొదటి పెళ్లిరోజు అన్నది ప్రతీ దంపతుల జీవితంలో చాలా శుభప్రదమైన రోజు. అటువంటి రోజు నాడు కూడా తనూ భర్త కలిసి వెళ్లలేని స్థితి. ఆమెకి మొదటిసారిగా దివాకరం చేసే వుద్యోగం మీద కోపం వచ్చింది. తను రైల్వే ఉద్యోగినిపెళ్లాడి తప్పుచేసిందేమోననిపించిందామెకు. హాయిగా ఏ టీచరునో పెళ్లాడితే తన భర్త ఎప్పుడూ తన ముందరే ఉండేవాడు. ఇదంతా తన ప్రారబ్ధం.

అనుకున్నట్లుగానే దివాకరం రెండురోజుల

## మామంచి శ్రియ

అందాలభామ శ్రియ తాజాగా ఓ నిర్ణయం తీసుకుంది. అదేంటంటే- సాఫ్ట్‌డ్రింక్ యాడ్స్ చేయకూడదనిట. సాఫ్ట్‌డ్రింక్ యాడ్స్ చేస్తే లక్షలే కాదు, కోట్లు కూడా పారితోషికంగా అందుతున్న ఈ రోజుల్లో అలాంటి ఆదాయానికి 'నో' చెప్పడం గొప్ప విషయమే కదా! సాఫ్ట్ డ్రింక్‌ల వల్ల ఆరోగ్యానికి కలిగే హాని గురించి కొంత కాలంగా వార్తలు వస్తూనే వున్నాయి. ఈ నేపథ్యంలోనే తనీ నిర్ణయం తీసుకున్నట్టు శ్రియ చెబుతోంది. ఇటీవలే తమిళ హీరో అజిత్ కూడా శీతల పానీయాల అడ్వర్టయిజ్మెంట్లలో నటించనని ప్రకటించిన తర్వాత ఇలాంటి నిర్ణయమే తీసుకున్న తార శ్రియ.

తరువాత వచ్చాడు. ఆ రెండు రోజులూ అతను ప్రమాదం జరిగిన స్థలంలో రాత్రి, పగలు పనిచేసి పడిపోయిన మట్టిని, పెద్ద బండరాళ్లను తొలగించి రైల్వేలైనుని పునరుద్ధరించడంతో మళ్లీ రైళ్లరాకపోకలు ప్రారంభమయ్యాయి. కానీ సమయానికి సరిగ్గా స్పందించి పాసింజర్‌ని ప్రమాదం నుంచీ తప్పించి ఎంతోమంది ప్రాణాలు కాపాడినందుకు దివాకరానికి ఎన్నో ప్రశంసలతోపాటు జనరల్ మేనేజరు అవార్డు కూడా దక్కింది.

దివాకరం యింట్లోకి వస్తూనే "సారీ జానకీ! యిలా జరుగుతుందనుకోలేదు. ఏం చేస్తాం మా రైల్వే ఉద్యోగాలు ముఖ్యంగా మా ట్రాక్ యింజనీర్లవి యింతే! మన పెళ్లిరోజునాడు యిలా జరిగినందుకు నాక్కూడా చాలా బాధగా వుంది" అంటూ విచారాన్ని వెలిబుచ్చాడు. అతనికి రెండు రోజులుగా సరిగ్గా నిద్రాహారాలు లేకపోవడంతో మనిషి బాగా నీరసించిపోయి ఉండడంతో జానక్కి అతన్ని ఏమీ అనాలనిపించలేదు. ఈ సంవత్సరం యిలా గడిచిపోయినా మళ్లీ సంవత్సరమైనా ఘనంగా జరుపుకోవాలని ఆమె సర్దిచెప్పుకుంది.

☆ ☆ ☆

కాలచక్రభ్రమణంలో మరో సంవత్సరం గడిచిపోయింది. ఈసారి కూడా పెళ్లిరోజునాటికి తమ ఊరురమ్మని మళ్లీ జానకి తల్లిదండ్రులు ఉత్తరం వ్రాసినా క్రితం సంవత్సరం చేదు అనుభవంతో యిక్కడే జరుపుకోవాలని ఆ దంపతులు నిశ్చయించుకున్నారు. ఇక పెళ్లిరోజు కోసం ప్రయాణం లేకపోవడంతో జానకి క్రితం సంవత్సరంలా టెన్షన్ లేదు. కాకపోతే ఈసారి ఏ ఆటంకాలు ఎదురుకాకూడదంటూ ఆ దేవుడికి మనసారా మొక్కుకుందామె. ఆమె మొరని ఈసారి సరిగ్గా ఆలకించినట్లున్నాడు ఆ దేవుడు. అందుకే ఆ పెళ్లిరోజునాడు ఏవిధమైన ఆటంకాలు లేకుండా సూర్యోదయం అయింది.

తెలతెలవారుతుండగానే ఆమె లేచి తలంటుపోసుకుని దివాకరాన్ని కూడా లేపి అతనికీ తలంటింది. త్వరగా తెమిలి అక్కడికి దగ్గరల్లోని బొర్రా స్టేషన్‌లోని వెంకటేశ్వరుడి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకోవాలని ఆమె ఆలోచన. సరిగ్గా ఏడుగంటలకి యిద్దరూ తయారై బయలుదేరుతూండగా హెడ్‌ట్రాలీమేన్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. వస్తూనే ఆయాసపడుతూ "దొరగారూ! మన నైట్ పెట్రోల్ మేన్ సోమన్నని గూడ్స్ రైలు పదమూడో టన్నెల్ ముందర గుద్దేసిందిట. తలకి బాగా దెబ్బ తగిలి అక్కడే పడిపోయాడట" అంటూ చెప్పడంతో దివాకరం మరో మాట మాట్లాడకుండా వెంటనే స్టేషన్ వైపు పరుగెత్తాడు.

స్టేషన్‌కెళ్లే ట్రాలీవాళ్ల సాయంతో ట్రాలీమీద అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పదమూడో టన్నెల్‌కి చేరుకున్నాడు. ఆ టన్నెల్ ముందర ట్రాక్ పక్కన సోమన్న పడి ఉండటాన్ని గమనించాడు దివాకరం. తలకి బాగా దెబ్బతగలడంతో ముఖంమీద రక్తపు మరకలున్నాయి. అతనికి వెంటనే నీళ్ళు త్రాగించి ట్రాలీమీద అతన్ని రోడ్ పాయింట్ దగ్గరకు తీసుకొచ్చేసరికి అదృష్టవశాత్తూ అప్పుడే అరకునుంచీ ఎస్.కోట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు వస్తోంది. దాన్ని ఆపి సోమన్నని ఎక్కించి అతనితోపాటు దివాకరం మరో యిద్దరు ట్రాలీవాళ్లు కూడా వెళ్లారు.

సరియైన సమయానికి అతన్ని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లడం వలన అతని ప్రాణానికి ముప్పు తప్పింది. యింటికొచ్చేసరికి రాత్రి పదిగంటలయింది.

దివాకరానికి యింటికొస్తుంటే ఎందుకో గిల్టీఫీలింగ్ కలగసాగింది. తనని పెళ్లి చేసుకొని జానకి ఏమీ అనుభవించలేకపోతోందన్న భావన అతనికి కలగసాగింది. అతనికి తనుచేసే ఉద్యోగంమీద మొదటిసారిగా కోపం వచ్చింది. తన ఉద్యోగంలో వ్యక్తిగత జీవితానికి సమయం వుండదు. ఎప్పుడూ ఉరుకులు పరుగులే!

దివాకరాన్ని చూడగానే ఆత్రంగా జానకి బయటకొచ్చీ "ఏవండీ సోమన్నకెలా వుంది, ప్రాణానికే భయం లేదుగా?!" అని అడిగేసరికి దివాకరానికి ఆశ్చర్యం వేసింది. తనను చూడగానే కోప్పడుతుందనుకున్న జానకి అలా అడిగేసరికి అతనికి ఒక్కసారిగా ప్రశాంతత ఆవరించింది.

"బాగానే ఉన్నాడు జానకీ! అతని ప్రాణానికేం భయం లేదు. సరిగ్గా సమయానికి అతన్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళడంవల్ల ప్రాణాలతో బయటపడ్డాడు సోమన్న. అది సరే జానకీ, ఈసారికూడా మన పెళ్లిరోజునాడు యిలా జరిగినందుకు నాకు చాలా బాధగా వుంది"

ఇంతలో సోమన్న భార్యాపిల్లలు గేటు తీసుకొని పరుగున రావడం వాళ్లు గమనించారు. వస్తూనే సోమన్న భార్య సీతాలు దివాకరం కాళ్లమీద పడి ఏడుస్తూ "తమరు దేవుడు బాబూ! మీరే లేకపోతే ఆడి పేణాలు పోయి ఉండేవయ్యా! మీరు చల్లగా వుండాలయ్యా" అంటూ బావురుమంది. ఆమె అలా తన కాళ్లమీద పడటం దివాకరానికి యిబ్బంది అనిపించింది. ఆమెని ఓదార్చి సోమన్నకి ఏమీకాదని చెప్పి ఆమెని పిల్లల్ని పంపించివేశాడు. అప్పుడు అక్కడ సూదిమొన పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం ఆవరించి వుంది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ దివాకరం "జానకీ! నా ఉద్యోగంలో యిలాంటివి సహజం. మనకు వ్యక్తిగత జీవితం చాలా తక్కువ. అందుకే మన రెండు పెళ్లిరోజులూ యిలా గడిచిపోయాయి. బహుశా మనకు పెళ్ళిరోజులు అచ్చిరావేమో! అందుకే యిలా ఆటంకాలు వస్తున్నాయి" అన్నాడు.

ఆ మాటలు విన్న జానకి కాసేపు మౌనం వహించింది. ఆ తరువాత మెల్లగా "లేదండీ! మీరు చేసిన పనికి నాకెంతో ఆనందంగా వుంది. మొదటి పెళ్లిరోజునాడు మీరు కొన్నివేలమంది ప్రాణాలు కాపాడారు. ఈరోజు సోమన్నని కాపాడి ఒక పేదవాడి కుటుంబాన్ని రక్షించారు. నిజంగా మన పెళ్లిరోజు చాలా శుభదినం. కేవలం పెళ్లిరోజంటే మనిద్దరం కలిసి చేసుకునే పండుగరోజు కాదండీ! అది పదిమందికి ఉపయోగపడితే అంతకన్నా గొప్ప విషయం ఏం వుంటుంది చెప్పండి. నిజంగా సోమన్న భార్య కళ్లల్లోని ఆనందం చూస్తుంటే ఈరోజు నాకెంతో ఆనందంగా వుంది. అతన్ని కాపాడటం మన పెళ్లిరోజున జరిగినందుకు ఆ దేవుడికి మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అందుకే మనం ప్రతీసారి పెళ్లిరోజుని ఎక్కడవుంటే అక్కడే జరుపుకుందాం! మీరేమీ యింక విచారించొద్దు" కంట ఉబికిన నీటిని తుడుచుకుంటూ చెప్పింది జానకి.

ఆ మాటలు విన్న దివాకరం మనస్సు దూదిపింజలా తేలికైంది. మనస్ఫూర్తిగా ఆమెని దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు. ఆ జంటని చూసి పున్నమి చంద్రుడు మేఘాల చాటుకి తప్పుకున్నాడు.

☆




